క్లుప్తంగా

ఎస్‌ఐగా వెంకట నరసింహులు



సోమల: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా వెంకట నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈయన బైరెడ్డిపల్లె నుంచి బదిలీపై వచ్చారు.

ఎస్‌ఐగా శ్రీనివాస్

రామకుప్పం: రామకుప్పం ఎస్‌ఐగా శ్రీనివాస్‌ను బాధ్యతలు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజ్‌గోపాల్, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, రెస్కో డైరెక్టర్ రవినాయక్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు మృతి



రమణారెడ్డి (ఫైల్)

రొంపిచెర్ల: పాము కాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీ మిట్టపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రమణారెడ్డి(57) వ్యవసాయ బావి వద్ద పాడి ఆవులకు గడ్డి కోస్తుండగా నాగు పాము కాటు వేసింది. దీంతో అతడు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు హుటాహుటిన రొంపిచెర్లకు తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్ నిర్ధారించారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అన్నమయ్య జిల్లా పీలేరుకు తరలించారు. మృతునికి భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ జీవలత పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రామచంద్రారెడ్డి (ఫైల్)

గంగవరం: మండలంలోని దండపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి(69) గురువారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి వెలుపలికి వచ్చిన ఆయన గుండెపోటుకు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఇది తెలుసుకున్న పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఇతర నాయకులు శుక్రవారం గ్రామానికి వెళ్లి రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారుడు బాలక్రిష్ణారెడ్డి(సుధ) ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్‌గా ఉన్నాడు.

వీడ్కోలు సన్మానం



ఈఓఆర్‌డిని సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

గంగవరం: మండలం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన సచివాలయ కార్యదర్శులు, ఈఓఆర్డి తదితరులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి ఈఓఆర్‌డి శివప్రసాద్ వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం నుంచి కృష్ణమూర్తి ఇక్కడికి వచ్చారు. కల్లుపల్లె సచివాలయ కార్యదర్శి లక్ష్మణ్‌రెడ్డి బంగారుపాళ్యం మండలానికి, కీలపల్లె సచివాలయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ సత్యసాయి జిల్లా గోరంట్లకు, కీలపల్లె డిజిటల్ అసిస్టెంట్ శైలజ తిరుపతి జిల్లా నారాయణవనంకు, గుండుగల్లు సచివాలయ కార్యదర్శి హరిబాబు పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లె సచివాలయానికి బదిలీ అయ్యారు. అలాగే గంగవరం హౌసింగ్ ఏఈ కనకసుందరం ఉద్యోగ విరమణ పొందారు. వీరందరినీ అధికారులు, నాయకులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా భాస్కర్

కుప్పం: కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా పోటుగారి భాస్కర్ నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉన్న భాస్కర్‌కు అదనంగా కుప్పం నియోజకవర్గ కన్వీనర్‌గా బాధ్యతలను అప్పగించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు మురుగేష్, కేశవరాజులు, నాగరాజు తెలిపారు.

తల్లి, కొడుకు ఆస్తి రగడ

పలమనేరు: ఆస్తి వివాదంతో తల్లి, కొడుకు పోలీసులకు శుక్రవారం పరస్పరం ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేశారు. తాను ఎద్దుల సంతవీధిలోని బంగారు దుకాణంలో ఉండగా స్వయానా తల్లి వాహిద, మామ రఫీ తనపై దాడి చేశారని పట్టణానికి చెందిన న్యాయవాది షేక్ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై కుమారుడే దాడి చేశారంటూ అతని తల్లి సైతం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి ‘వార్డు బాట’



కుమ్మరవీధిలో వృద్ధురాలి సమస్యను ఆలకిస్తున్న మంత్రి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి, (ఇన్‌సెట్) దర్గాలో ఆశీస్సులు పొందుతున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వార్డుబాట బాటలో భాగంగా రెండవరోజు శుక్రవారం ఉత్సాహంగా పర్యటించారు. మున్సిపాలిటీలోని కట్టకిందపాళ్యెం చింతలవీధి, కుమ్మరవీధి, తూర్పుమొగశాల, బాలాజి థియేటర్, ఎంబీటి రోడ్డు, సుబేదారువీధి, నాన బాలవీధి ప్రాంతాలలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి మంత్రి కలియదిరిగారు. పలుచోట్ల మహిళలు కర్పూర నీరాజనాలతో స్వాగతం పలికారు.

అభివాదం చేస్తూ..ఆత్మీయంగా పలకరిస్తూ..

మంత్రి ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ, ఆత్మీయంగా పలకరించారు. కొందరి ఆహ్వానం మేరకు వారి ఇళ్లలోకి వెళ్లి అక్కడి వారితో మాట్లాడారు. వృద్ధురాలు లక్ష్మమ్మ నివేదించిన ఇంటి సమస్యపై స్పందించి అక్కడిక్కడే పరిష్కరించారు. అలాగే ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని చదివి, అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇక, ద్వితీయశ్రేణి నాయకులు మంత్రి వెంట వార్డుల్లో పరుగులు తీశారు.

సచివాలయంలో వినతుల స్వీకరణ

తూర్పుమొగశాల సచివాలయంలో సుమారు రెండు గంటల పాటు మంత్రి కూర్చుని వినతులు స్వీకరించారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో సరదాగా గడిపారు. ఈ సమయంలో బోయకొండ ఈఓ చంద్రమౌళి, సబ్‌రిజిస్ట్రార్ బాలాజి, పులిచెర్ల తహసీల్దార్ శేషగిరిరావు, నూతన ఎస్‌ఐ సుకుమార్‌తో పాటు పలువురు మంత్రిని కలిశారు.

కోలాహలంగా ప్రారంభోత్సవాలు

కుమ్మరవీధి విస్తరణ ప్రాంతంలో రూ.7 లక్షలతో రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. అలాగే ఉర్దూ స్కూల్ వీధిలో రూ.5.5 లక్షలతో రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. వివేకానంద నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న కాలువ పనులను ప్రారంభించారు.

మొక్కలు నాటిన మంత్రి

కట్టకిందపాళ్యెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

దర్గాలో ప్రార్థనలు

రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం వార్డుబాటలో కుమ్మరవీధి దర్గాలో ప్రార్థనలు జరిపారు. నమాజ్ వేళలు కావడంతో మంత్రి గంటసేపు వార్డుబాటను ఆపివేశారు. దర్గాలో మతగురువులు మంత్రికి అల్లా ఆశీస్సులు అందజేశారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, ఎంఆర్‌సి.రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

వార్డుబాటలో 26 వినతులు

వార్డుబాట కార్యక్రమంలో మొత్తం 26 వినతులు అందాయి. ఉద్యోగాల కోసం ఏడుగురు, ఇంటి స్థలాలు కావాలని ఆరుగురు, రెవెన్యూ సమస్యలపై ఇద్దరు, ఆర్థిక సహాయం కావాలని ఒకరు, పెన్షన్ కోసం ముగ్గురు, బదిలీ కోసం, ఎంబీబీఎస్‌లో, వసతి గృహంలో సీటు కావాలని ఒకరొకరు చొప్పున మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అలాగే రోడ్డు దురాక్రమణ అరికట్టాలని ఒకరు ఫిర్యాదు చేశారు.

నేటి పర్యటన ఇలా..

వార్డుబాటలో శనివారం 13వ వార్డులోని గాంధీనగర్, మోతినగర్ నుంచి ప్రారంభం అవుతుందని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. 9, 10 , 13, 24, 25, 30 వార్డులలో మంత్రి పర్యటిస్తారని, రహమత్‌నగర్, నేతాజినగర్‌తో పర్యటన పూర్తి అవుతుందని ఆయన చెప్పారు.

ఘనంగా రైతు ఉత్పత్తిదారుల సంఘ వార్షికోత్సవం



రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి

పలమనేరు: రైతులంతా సంఘటితమై దళారులు, మండీ నిర్వాహకుల కమీషన్ బెడద లేకుండా వ్యవసాయోత్పత్తులను మంచి ధరకు విక్రయించుకోవాలని పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కౌండిన్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆరవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడారు. రైతులు సంఘటితమై వివిధ రకాల కూరగాయలను బెంగళూరు, చెన్నై మహానగరాల్లో కార్పొరేట్ కంపెనీలకు విక్రయిస్తుండటం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో మరిన్ని సంఘాలు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణదేవి, మార్కెటింగ్ సెక్రటరీ సంజీవకుమార్, ఏఓ సంధ్య, ఏపీ మాస్ నిర్వాహకులు, ఉద్యోగులు, సంఘ నేతలు మనోజ్ రెడ్డి, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు విగ్రహ ప్రతిష్ఠాపన

సోమల: మండలంలోని కరకమందలో చెన్నమల్లయ్య తాత ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. 30న గోపూజ, విశేష హోమాలు,గోపురంపై కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు తిరుమణ్ణామలై ఆర్యవైశ్య పురోహితులతో నిర్వహించనున్నట్లు చెప్పారు.

● ఆరాధనోత్సవం



త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న నాయీ బ్రాహ్మణులు

రొంపిచెర్ల: త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని శుక్రవారం రొంపిచెర్లలో నాయీ బ్రాహ్మణులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పురవీధులలో త్యాగరాజ చిత్రపటాన్ని ఊరేగించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు జ్ఞానమూర్తి, రెడ్డిప్రసాద్, మునేంద్ర, మునిరాజ, వెంకటముని, చిన్న నాగరాజ, రమేష్, రెడ్డెప్ప, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఉదంతంపై నిరసన



మణిపూర్ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తున్న మానవ హక్కుల కార్యకర్తలు

పలమనేరు: మణిపూర్ ఘటనకు కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ శుక్రవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించాయి. సంస్థ నాయకులు మాట్లాడుతూ, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, ఒకరిపై సామూహిక అత్యాచారం చేయడం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి అమానవీయ సంఘటన చోటుచేసుకుందని, కళ్లముందే అఘాయిత్యాలు జరుగుతున్నా అక్కడి పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. నిరసనలో మునిరత్నం, వేలాయుధం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ప్రపంచ ప్రకృతి దినోత్సవం పురస్కరించుకుని పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో విరివిగా మొక్కలు నాటారు. ప్రధానంగా మహిళలతో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటించి మాట్లాడారు. మొక్కలు చెట్లయ్యే వరకు సంరక్షించాలని కోరారు.



సదుం: మొక్కలు నాటుతున్న సిబ్బంది



పుంగనూరు మండల కార్యాలయం వద్ద..



చౌడేపల్లె : కొండామర్రి వద్ద..



పులిచెర్ల (కల్లూరు): నన్నూరువారిపల్లెలో..



పలమనేరు: కరిడిమొడుగులో..



రొంపిచెర్లలో మొక్కలు నాటుతున్న సర్పంచ్



గంగవరంలో..



బైరెడ్డిపల్లె : లక్కనపల్లె సచివాలయం వద్ద..

పుంగనూరు: ప్రతి మహిళా ఒక మొక్కను నాటి పచ్చదనం పెంపునకు తమవంతు కృషి చేయాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మహిళా అధికారులు రాజేశ్వరి, జయంతి సిబ్బందితో మొక్కలు నాటారు. అలాగే సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఇళ్ల వద్ద యుద్ధప్రాతిపదికన మహిళా ప్రజాప్రతినిధులు, సంఘమిత్రలు, మహిళలతో మొక్కలు నాటించారు. 23 పంచాయతీల్లోను నేరేడు, జామ, ఎర్ర తురాయ్, వేప, కానుగ లాంటి ఐదువేల మొక్కలు నాటినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. ఎంపీడీఓ నారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, బాబు, ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని కొండామర్రి సచివాలయం వద్ద సర్పంచ్ జయసుధ, ఈఓపీఆర్డీ కృష్ణవేణి స్వయం సహాయక సంఘాలతో కలిసి మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా 3వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఎంపీటీసీ షాహీనా, ఏపీఓ శ్రీనివాస్, జేఈ ధనుంజయుడు, పంచాయతీ కార్యదర్శి సుకుమార్ రెడ్డి, నేతలు నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

సోమల: సోమలలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, ఎంఈఓ శివరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ప్రసూన, సీఆర్పీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సదుం: మండలంలోని కంభంవారిపల్లె సచివాలయంలో సర్పంచ్ రెడ్డిదీప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి తులసీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని నన్నూరువారిపల్లె, రాయవారిపల్లెలో శుక్రవారం మహిళలతో కలిసి ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి మొక్కలు నాటారు. సర్పంచులు మునిరత్నం, వాసుదేవరెడ్డి, మధు, ఏపీఓ షౌకత్‌అలీ, ఈసీ కృష్ణ, జేఈ తేజ, నాయకులు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మొక్కలు నాటి మాట్లాడారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ చోట్ల 2000 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, సీసీలు రమణారెడ్డి, వెంకట నారాయణరావు, నాగరాజ, సచివాలయ ఉద్యోగులు, సంఘమిత్రలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిద్దాం

పలమనేరు: ప్రకృతిని ప్రేమిద్దాం..పర్యావరణాన్ని కాపాడుకుందామని మండలంలోని కరిడిమొడుగు గ్రామ సర్పంచ్ హంసవేణి అన్నారు. గ్రామంలోని పలు కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. అలాగే గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి ఇళ్ల ముందు నాటాలని ఆమె కోరారు. మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ విద్యాసాగర్ పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ పార్వతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలతో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. అలాగే ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యోగులు సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రాంగణాల్లో పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, వివిధ అధికారులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : మండలంలోని సచివాలయాల వద్ద అధికారులు విరివిగా మొక్కలు నాటారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజి మాట్లాడారు. ఆయా సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సంతోషమే జగనన్న సంకల్పం



కోలాల తిమ్మనపల్లె బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

- గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రాష్ట్రంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, అభివృద్ధి చెందాలనే సంకల్పంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం కోలాల తిమ్మనపల్లె, కోనేరుకుప్పం గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో తెలియజేశారు. సమస్యలపై ఆరా తీశారు. టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలుకుబడి ఉన్నవారికి మాత్రమే అందితే, తమ ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ నేరుగా ఇళ్లముంగిటే అందిస్తున్నామన్నారు. రైతులు సంక్షేమానికి, ప్రజల ఆరోగ్యానికి దేశంలో ఏ రాష్ట్రమూ చేయని విధంగా సీఎం చేస్తున్నారని, రైతు భరోసా, ఆర్బీకే కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ సేవల గురించి వివరించారు. గత ప్రభుత్వ పాలనకు, తమ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని తమ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు కృష్ణమూర్తి, సుకుమార్, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, నాయకులు ఏవీ జయరాం, విజయకుమార్, సంపంగి, సోమారెడ్డి, సుబ్రమణ్యం, మురుగేష్, సాగర్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్సీ

రామకుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ స్థానిక మహిళలతో కలసి మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణ,ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



పకడ్బందీగా భూముల రీసర్వే



పులిచెర్లలో భూముల రీసర్వే చేస్తున్న అధికారులు



సదుం: సరిహద్దు రాళ్ల ఏర్పాటు కార్యక్రమంలో నాయకులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని భూముల రీసర్వేని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వే చేశారు. హద్దులు గుర్తించి, రాళ్లు నాటినట్లు ఆయన చెప్పారు. సర్పంచ్ రాణెమ్మ, ఆర్ఐ దొరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె రెవెన్యూ గ్రామంలో రీసర్వే చేసిన భూముల సరిహద్దుల వద్ద రాళ్లు నాటే కార్యక్రమాన్ని సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి పూజ చేసి ప్రారంభించారు. జగనన్న భూరక్షలో హద్దులను గుర్తించినట్టు వీఆర్వో పురుషోత్తం తెలిపారు. జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సర్వేయర్ సతీష్, నాయకులు హరి, మునిరాజ, వీఆర్‌ఏ గంగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు వేగవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. మండలంలో షాదీమహళ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు సిద్ధంగా ఉన్నాయని, అయితే కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాలేదని, ఎన్నికలు సమీపంలోనే ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా పనులను వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో కొందరు సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం సరికాదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీటీసీలు రమణమ్మ, సిరాజున్నీసా, సర్పంచులు ఇబ్రహీంఖాన్, రమణయ్య, నాగిరెడ్డి, హేమలత, సుధారాణి, పార్టీ నాయకులు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, శ్రీనాధనాయుడు, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు



వల్లిగట్లలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ



పెద్దపంజాణి మండలంలో..



పలమనేరు : టీఎస్ అగ్రహారంలో..

సోమల: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ మేలు కలుగుతుందని ఎంపీపీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వల్లిగట్ల, కామిరెడ్డిగారిపల్లె పంచాయతీలలో సర్పంచులు సౌజన్య, శ్రీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. అర్హులైన 402 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేసి ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, ఎంపీటీసీ సభ్యురాలు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రవీంద్రరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల సుబ్రమణ్యం, నేతలు నిరంజన్ రెడ్డి, సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

560 మందికి ధ్రువపత్రాల పంపిణీ

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె, తుర్లపల్లె సచివాలయాల వద్ద శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. 560మందికి వివిధ ధ్రువపత్రాలను ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగా రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, ఆంజమ్మ, సింగిల్‌విండో చైర్మెన్ ఓబుల్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పృథ్వీ, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్, మురళి, ఎంపీడీఓ భాస్కర్, పార్టీ నాయకులు రాజారెడ్డి పాల్గొన్నారు.

టీఎస్ అగ్రహారంలో 312 మందికి..

పలమనేరు: మున్సిపాలిటీలోని టీఎస్ అగ్రహారంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 312మందికి వివిధ ధ్రువపత్రాలను మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఓం శక్తి భక్తుల ఊరేగింపు



రామకుప్పంలో శుక్రవారం ఓం శక్తి భక్తులు ఊరేగింపు నిర్వహించారు. అంబలితో ఉన్న చిన్న దుత్తలను తలపై పెట్టుకుని ఓం శక్తి.. పరాశక్తి అంటూ నామస్మరణ చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి అంబలి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. - రామకుప్పం